తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్‌కు... ఐసిటి అకాడమీ ఎక్స్‌లెన్స్ అవార్డు



ఐసిటి అకాడమీ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్న బిసిఎన్ గ్రూప్ ఛైర్మన్

కుప్పం, డిసెంబర్ 14 ప్రభాతవార్త : కుప్పం బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్‌కు ఐసిటి అకాడమీ మంగోడిబి ఎక్స్‌లెన్స్ అవార్డును ఐసిటి అకాడమీ రాష్ట్ర అధిపతి డాక్టర్ దినకర్‌రెడ్డి ప్రదానం చేశారు. అకడమిక్ అవుట్ అండ్ ఔట్, పరిశ్రమ అవసరాల మధ్య అంతరాన్ని తగ్గించడం ద్వారా ప్రతి అభ్యాసకుడు పరిశ్రమలకు సిద్ధంగా ఉండేలా అవకాశం కల్పించే ఉద్దేశంతో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్, ఐసిటి అకాడమీ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుచేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబు తెలిపారు. దీంతో విద్యార్థులు అధ్యాపకుల మధ్య సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు తదితరాల పెంపొందించడంతో పాటు పరిశ్రమలపై అవగాహన, డిజిటల్ ఎంపవర్‌మెంట్, పరిశోధన, ప్రచురణలు కలిసి పనిచేయడం జరుగుతుందన్నారు. ఇందుకు విశేష కృషి చేసిన బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్‌కు ఐసిటి అకాడమీ ఎక్స్‌లెన్స్ అవార్డుతో సత్కరించింది. అలాగే బెస్ట్ కోఆర్డినేటర్ అవార్డును పిఒ డా॥ జయకుమార్‌కు అందించారు. కార్యక్రమంలో కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, ఐసిటి అకాడమీ రిలేషన్‌షిప్ మేనేజర్ నాగేశ్వరయ్య, సిఇఒ సాగర్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్ పాల్గొన్నారు.

## అపార్ కష్టాలకు వెసలు బాటు...

# ఆధార్ అప్‌డేట్‌కు మరికొంత టైమ్ !

**-జూన్ 14వరకు గడువుపొడిగించిన కేంద్రం**



తిరుపతి, డిసెంబర్ 14ప్రభాతవార్త: ప్రస్తుతం పుట్టిన బిడ్డనుండి వృద్ధుల వరకు తమ చిరునామా ఆధారాలు "ఆధార్‌కార్డు"తోనే ప్రాదాన్యత సంతరిం చుకుంది. పాఠశాలలో చేరడం నుండి ఆస్పత్రుల్లో వైద్యసేవలకు ఏ చిన్న ప్రభుత్వ పథకం లబ్ధిదారులు కావాలన్నా "ఆధార్" ప్రాతిపదికగా మారింది. ఈ నేపథ్యంలో 10,15 సంవత్సరాల క్రిందట తీసుకున్న ఆధార్‌కార్డులో చిరునామా మార్పు, పుట్టినతేదీ, పేరు తదితర వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని కేంద్రం ఆదేశించింది, ఇప్పుడు ఎక్కడ చూసినా, ఎవరి నోట విన్నా ఆధార్ అప్‌డేట్ మాటే. ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లాతో బాటు తిరుపతి జిల్లాలోనూ అన్ని గ్రామాల ప్రజలు,మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలు, పట్టణాలు, నగరాల్లో నివాసముంటున్న ప్రజలు చాలావరకు తమతమ చిరునామాలు, పేర్లు మార్పు, పుట్టినతేదీ మార్పు తదితర వివరాలతో అప్‌డేట్ చేసుకునేందుకు తంటాలు పడుతున్నారు. ప్రస్తుతం తపాల కార్యాలయాల్లో, కొన్ని జాతీయ బ్యాంకుల్లో ఆధార్ కేంద్రాలు నడుస్తున్నాయి. ఈ ఆదార్‌కేంద్రాల వద్ద ఇప్పటికే జారీ అయిన ఆదార్‌కార్డులు అప్‌డేట్ చేసుకునేందుకు కేంద్రం విడతలవారీగా గడువు విధించింది. ఇప్పుడు శనివారంతో ఆధార్‌అప్‌డేట్ గడువు ముగియడంతో చాలీచాలని కేంద్రాలు, రెండవశనివారం గడువు ముగియడంతో అత్యధికశాతం మంది ప్రజలు తమ కార్డును అప్‌డేట్ చేసుకునే పరిస్థితి లేకపోయింది. ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తు లతో కేంద్రం ప్రజల అవసరాలను, సమస్యలను తెలుసుకుని ఈ గడువును 2025 జూన్ 14వరకు అప్‌డేట్‌కు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వు లిచ్చింది. ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకునే వాళ్ళకు బిగ్‌రిలీఫ్ లభించింది. ప్రతి పది సంవత్సరాలకు ప్రజలు తమ సమాచారాన్ని ఆదార్‌లో అప్‌డేట్ చేయాలి. వయస్సు, పేరు, ఫోటో, చిరునామా వంటివి మార్చుకోవచ్చు. ఇందుకుగాను ఇప్పుడు ఆయా ప్రాంతా ల్లోని తపాల కార్యాలయాల్లో,బ్యాంకుల్లో, ప్రాదేశిక ఆధార్‌సేవా కేంద్రాలు, యుఐడిఏఐ వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా మార్పులు చేసుకునే వెసలూబాటు లభించింది. కాగా ఇప్పటికే కొన్ని ఆదార్‌కేంద్రాల వద్ద జనం నుండి డబ్బులు దండుకుంటున్నారు. ఇవన్నీ గమనించిన కేంద్రం ఏకంగా వచ్చే ఏడాది జూన్ 14 వరకు అప్‌డేట్‌కు అవకాశం కల్పించడం పట్ల జనం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ఆధార్ కేంద్రాలను కూడా అదనంగా ఏర్పాటు చేయాలని, చదువుకునే విద్యార్థులకు ఆయా విద్యా సంస్థల్లోనే ఈ సౌకర్యం కల్పిస్తే బాధలు తప్పుతాయని తల్లిదండ్రులు కోరుదుతున్నారు.

# 'కల్తీ'నెయ్యి కేసులో నివేదికలు సిద్ధం !

**త్వరలో కీలక వ్యక్తుల విచారణ ?**



తిరుపతి,డిసెంబర్ 14ప్రభాతవార్త : తిరుమల లడ్డూల తయారీలో కల్తీనెయ్యి పాపానికి కారకులను గుర్తించిన సిబిఐ సిట్ అధికారులు చర్యలకు సిద్దమవుతోంది. గత కొద్దిరోజులుగా సిబిఐ సిట్ అధికారులు అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో లోతుగా దర్యాప్తుచేపట్టి నివేదికలు సిద్దం చేశారు. కల్తీనెయ్యి పాపంలో దోషులెవరనేది తేల్చే పనిలో రెండు వారాల క్రిందట ఢిల్లీనుండి, విశాఖపట్నం నుండి వచ్చిన నలుగురు డిఎస్పీ స్థాయి అధికారులు ,తిరుపతిలో జిల్లా అదనపు ఎస్పీతో కలసి అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని కార్యాలయం కేంద్రంగా సిట్ బృందం నిమగ్నమై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించిన విషయం విదితమే. లడ్డూల తయారీలో వినియోగిస్తున్న ఆవు నెయ్యిలో పందికొవ్వు, గొడ్డుకొవ్వునూనెలతో బాటు శాఖాహార పదార్థాలతో తయారుచేసిన నూనెలు కల్తీచేసి పంపిన కాంట్రాక్టర్లు, ఇక్కడ పరీక్షించి వెనక్కు పంపాల్సిన టిటిడి అధికారులు, ల్యాబ్, మార్కెటింగ్, విజిలెన్స్ ఉద్యోగులు పాత్రపై నివేదికలు తయారు చేశారు. పవిత్రమైన లడ్డూలను కలుషితంచేసిన పాపంలో రానున్న రోజుల్లో ఎవరిని విచారణ చేయనున్నారనేది ఇప్పుడు ఆసక్తికర చర్చగా మారింది. ఈ కేసులో క్లైమాక్స్‌లో శిక్ష ఎవరికి పడనుందనేది త్వరలోనే తేలిపోనుంది.

## బ్రిడ్జి నిర్మాణం కలగా మిగలడంతో...

# తీవ్ర ఇబ్బందుల్లో ఐదు గ్రామ ప్రజలు



కేవీబీ పురం, డిసెంబరు 14 ప్రభాతవార్త: వాయుగుండం ప్రభావంతో కేవీబీ పురం మండలంలో రెండు రోజులుగా భారీ వర్షాలు పడిన నేపథ్యంలో మండలంలోని ఎంఏ రాజుల కండ్రిగ వద్ద ఉన్న పూడి, సీకే పురం కల్వర్టు వరదల్లో కొట్టుకుపోవడంతో మూడు పూడి గ్రామాలు పోలి నాయుడు కండ్రిగ, నాలుగు ఎస్టీ కాలనీలు జన జీవనానికి దూరమయ్యారు. పోలినాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన వెంకటేష్ కుటుంబం 12 మంది దైవ దర్శనార్థం మూడు రోజుల క్రితం తిరుమల వెళ్లి తిరుగు ప్రయాణం రావడంతో పూడి సీకే పురం కల్వర్టు కొట్టుకుని పోయి వరద నీరు పారుతున్నప్పటికి ఇల్లు చేరుటకు వారు సాహసించి వాగును దాటారు. అతిజాగ్రత్త మీద దాటుకోవడం జరిగింది. ప్రమాదవ శాత్తు ఏదైనా జరిగి ఉంటే ప్రాణాలు గాలిలో కలిసిపోయేవి. పూడి-సీకేపురం కల్వర్టు ప్రతిసంవత్సరం కొట్టుకుపోతున్న నేపథ్యంలో కొన్ని సంవత్సరాలుగా ఐదు గ్రామాలకు చెందిన వారు బ్రిడ్జి నిర్మాణం కోసం నేతలను అధికారులను వేడుకుంటున్నారు. అనేక పర్యాయాలు రహదారిపైన ధర్నాలు సైతం నిర్వహించారు. కానీ నేతల్లో కాని అధికారుల్లో కాని చలనం లేదు. కల్వర్టు ప్రతిసంవత్సరం కొట్టుకుని పోవడం వల్ల విద్యార్థుల పరిస్థితి గర్భవతుల పరిస్థితి రైతుల పరిస్థితి వర్ణనాతీతం. తుఫాను తాకిడికి పూడి-సీకే పురంలో ఒక వ్యక్తి అనారోగ్యంతో వాగు దాటలేక మృత్యువాత పడ్డాడు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. అదే విధంగా జయలక్ష్మిపురం కాలనీ వాసుల పరిస్థితి కూడా వర్ణనాతీతం. కొట్టాల మిట్ట ఎస్టీ కాలనీ వాసులు పరిస్థితి కూడా మరి దారుణంగా ఉంది. బ్రిడ్జి నిర్మాణాల కోసం సంవత్సరాల తరబడి పోరాటాల సాగిస్తున్న మమ్మల్ని పట్టించుకునే దిక్కు లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నేతలు స్పందించి మూడు రోడ్ల బ్రిడ్జి నిర్మాణాలు మంజూరు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు కోరుతున్నారు.

# సాగునీటి సంఘాల ఎన్నికల్లో తెలుగుదేశం హవా

చిత్తూరు, డిసెంబర్ 14 ప్రభాతవార్త: సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ చక్రం తిప్పింది. జిల్లాలోని 95 శాతం సాగునీటి సంఘాల్లో అధికార తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. జిల్లాలో సదుం మండలంలో రెండు సాగునీటి సంఘాలకు మినహాయించి మిగిలిన సాగునీటి సంఘాలు అన్ని ఏకగ్రీవం అయ్యాయి. సదుం మండలంలో సాగునీటి సంఘ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల కోసం పోటీ నెలకొనడం పోటీలో వున్న వారి రాజీకి ససేమిరా అనడంతో తప్పని పరిస్థితుల్లో ఇక్కడ అధికారులు ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. జిల్లాలో మొత్తం 220 సాగునీటి సంఘాల పరిధిలో 1,357 నియోజకవర్గాలకు శనివారం అధికారులు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 217 సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు ఏకగ్రీవం అయ్యా యి. తవణంపల్లి మండలం తొడతర సాగునీటి సంఘ ఎన్నికలు నిలిపివేయడ్డాయి. ఈ ఎన్నికలను మరొక సారి నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల అనంతరం జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ క్షేత్ర స్థాయిలో తన పట్టు నిరూపించుకుంది. జిల్లాలో 220 సాగునీటి సంఘాల్లో అత్యధిక సాగునీటి సంఘాల్లో ఎన్నికల్లో పాల్గొని పోటీ చేయాలని రైతుల్లో ఆశలు వున్నప్పటికీ ఆ ఆశలను అధికార తెలుగుదేశం పార్టీ వమ్ము చేసింది. తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు ఒక్కరే ఎన్నికల బరిలో వుండేలా ఆ పార్టీ పక్కాగా వ్యూహం రచించి అమలు చేసింది. దీనికి అధికారులు సైతం మద్దతు పలకడంతో జిల్లాలో చాలా వరకు సాగునీటి సంఘాల అధ్యక్ష, కార్యదర్శి పదవులు ఏకగ్రీవం అయ్యాయి.

పూతలపట్టు మండలంలో ఓ సాగునీటి సంఘ అధ్యక్ష స్థానానికి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ ఎన్నికల అధికారి ఒక్కరి నామినేషన్‌ను మాత్రమే ఆమోదించి మరొక అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించడంతో ఇక్కడ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఇదే తరహా ఎన్నికలు జిల్లాలో శనివారం జరిగాయని అత్యధిక సాగునీటి సంఘ సభ్యులు ఆరోపిస్తున్నారు. సాగునీటి సంఘ సభ్యులుగా వున్న వారికి సైతం శనివారం ఎన్నికల పోలింగ్ అనే విషయంను అధికారులు తెలియనీయలేదని ఆరోపణలు వున్నాయి.

## గ్రామాల్లో సాగునీటి సంఘాల సందడే సందడి!

**-శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 129 ఏకగ్రీవమే**

శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తి రూరల్,డిసెంబర్ 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికల సందడి చోటు చేసుకుంది. అయితే గ్రామాల్లో ఏకాభిప్రాయంతో అన్ని సంఘాలకు ఏక గ్రీవ ఎన్నికలు జరిగినట్లు ఇరిగేషన్ అధికారి మదనగోపాల్ వివరించారు. శ్రీకాళహస్తి మండలంలో 54,తొట్టంబేడులో 27 ఏర్పేడులో 35, రేణిగుంటలో 7 సాగునీటి సంఘా లకు ఎన్నికలు జరగగా అన్ని ఏకగ్రీవం అయినట్లు సమాచారం అందినట్లు మదనగోపాల్ వివరించారు. ఎక్కడ ఎలాంటి వివాదాల్లే కుండా జరిగినట్లు సమాచారం అందిందని తెలిపారు.

**శ్రీకాళహస్తి మండలంలో...**

శ్రీకాళహస్తి మండలంలోని 54 సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగినట్లు సమాచారం అందింది.నారాయణ పురం నీటి సంఘానికి జరిగిన ఎన్నికల్లో గ్రామానికి చెందిన నారాయణపురం గోపి, బత్తినయ్యలు ఎన్నికలను ఏకగ్రీవం చేయటానికి సమాలోచనలు జరిపారు. అధ్యక్షులుగా



నారాయణ పురం,ముచ్చివోలు సాగునీటి సంఘాల పాలకమండళ్ళు

వి.ము నిరెడ్డి, ఉపాధ్యక్షులుగా సిద్దయ్య,సభ్యులుగా మునిరెడ్డి, సత్యం, హేమంత్, రాము, వెంకటమునిలను ఎన్నుకున్నారు.పెద్ద చెరువులకు సంబంధించిన వివరాలను ప్రకటించారు. తొండమనాడు చెరువుకు సంబంధించిన సాగునీటి సంఘానికి దామోదర్‌రెడ్డిని అధ్యక్షునిగి ఎన్నుకున్నారు. కాగా సభ్యులుగా సంగటి రాజశేఖర్‌రెడ్డి, తమ్ముల మునెయ్య,కందాటి వీరరాఘవరెడ్డి, అక్కుపల్లి మురళి, పల్లమాల రంగారెడ్డిలను ఎన్నుకున్నారు.ముచ్చివోలు సాగునీటి సంఘానికి అధ్యక్షులుగా మురళీ మోహన్‌రెడ్డి, సభ్యులుగా హరిప్రసాద్, నారాయణ, సుబ్బరావు, మురళి, నారయ్యలను ఎన్నుకున్నారు. శాసన సభ్యుడు బొజ్జ సుధీర్‌రెడ్డి స్వగ్రామం సాగునీటి సంఘానికి పోలిరెడ్డి,బివిపురం సాగునీటి సంఘానికి శ్రీనివాసులు, పోలికి గున్నయ్య, రామలింగాపురానికి సుధాకర్‌రెడ్డిలను అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

# ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే

**- కలెక్టర్‌తో కలిసి రూ.7.10 కోట్ల రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మురళీమోహన్**



కాశిరాళ్ళ నుండి తమిళనాడు సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

యాదమరి, డిసెంబర్ 14 ప్రభాతవార్త: యాదమరి మండల ప్రజలకు పూతల పట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఇచ్చిన మాటను నెరవేర్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చిత్తూరు-గుడియాత్తం రహదారిలో కాశిరాళ్ళ నుండి తమిళనాడు సరిహద్దు వరకు పెద్ద గుంతలు వుండటం వీటిని గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడితే ఈ రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన వెంటనే ఈ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. జిల్లాకు వచ్చిన సిఎం నారా చంద్రబాబు నాయుడుకు ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి నిధులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధుల నుండి రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. సత్వరం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని భావించిన ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి చిత్తూరు-గుడియాత్తం రహదారిలో కాశిరాళ్ళ నుండి తమిళనాడు సరిహద్దు వరకు నిర్మించే రోడ్డుకు భూమి పూజ చేసి ప్రారంభించారు. సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ 7.10 కోట్ల రూపాయలతో చిత్తూరు-గుడియాత్తం రహదారిలో కాశిరాళ్ళ నుండి తమిళనాడు రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు ఉపయోకరంగా వుంటుందన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మరమ్మత్తులకు గురైన రోడ్లను వేగంగా మరమ్మత్తులు చేయడం, ప్రజా సంచారం ఎక్కువగా వున్న ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తమిళనాడు రాష్ట్ర సరిహద్దు నుండి యాదమరి పోలీస్ స్టేషన్ వరకు మొత్తం 8 కిమీ దూరం వుందని ఇందులో 4 కిమీ నూతన రోడ్లు నిర్మాణం అయితే మిగిలిన 4 కిమీ రోడ్డులో మరమ్మత్తు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవతో ఈ రోడ్డుకు మోక్షం కలిగిందని, రెండు నెలల్లో ఈ రోడ్డు పనులు పూర్తి చేయడం జరుగుతుం దన్నారు. రోడ్డు పూర్తిగా డ్యామేజ్ అయిన చోట్ల కొత్త రోడ్డు నిర్మించడం జరుగుతుందని, పాక్షికంగా రోడ్డు డ్యామేజ్ అయితే చోట్ల మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇది మంచి ప్రభుత్వమని ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మండలంలో అవసరమైన చోట్ల రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్. రాజసింహులు, ఆర్‌అండ్‌బి ఇఇ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధి ఎపిడి సుబ్రమణ్యం, ఎంపిడిఓ వేణు, తహసిల్దారు పార్థసారధి, ఎఇలు ఆదికేశవులు, ప్రసాద్‌నాయుడు, ఇఒఆర్డీ సుకుమార్‌రెడ్డి, ఎపిఓ బాల, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొరార్జీ, మండల తెలుగుయువత అధ్యక్షులు గుణశేఖర్, జనసేన అధ్యక్షుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో ఉద్రిక్తతంగా మారిన...

# రివర్‌వ్యూ హోటల్ ప్రహరీగోడ వివాదం!

**-మోహరించిన పోలీసులు,రెవెన్యూ అధికారులు -అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యేలు కరుణాకర్‌రెడ్డి, మధుసూధనరెడ్డి -ఈ ప్రాంతం బఫర్‌జోన్‌లో ఉన్నదంటున్న అధికారులు**



రివర్‌వ్యూ ముందు భాగాన్ని తొలగిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోని స్వర్ణముఖి తీరాన నిర్మించిన 'రివర్‌వ్యూ' వివాదం శనివారం క్లైమాక్స్‌కు చేరింది. మున్సిపల్ అధికారులు, పోలీసులు ఉదయం 6 గంటలకే అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఆదివారం రాత్రే యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు చెబుతున్నారు. తెల్లారకముందే జెసిబిలతో మున్సిపల్ కమిషనర్ బి.గిరి కుమార్ టౌన్ ప్లానింగ్ అధికారి శారద వారి సిబ్బంది జెసిబిలతో హాజర య్యారు. రిసార్ట్‌కు సంబంధించిన ప్రహారి గోడలను పడగొట్టడానికి సమాయత్తం కాగా మాజీ శాసనసభ్యుడు తాటిపర్తి చెంచురెడ్డి ఆతని కుమార్తె చెంచులక్ష్మిలు అడ్డుకున్నారు. ఆనకట్టే, మా స్థలంలో ఉందని, కట్టకునాడు తాము 15 అడుగుల స్థలం వదలిపెట్టామని, తమ వద్ద రికార్డులున్నాయని ఆడ్డుకున్నారు. మధ్యాహ్నం వరకు డోలాయమానంగా సాగిన ఆక్రమణల తొలగింపు, తరువాత రూటు మారింది. అయితే శ్రీకాళహస్తి మాజీ శాసన సభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, తిరుపతి మాజీ ఎంఎల్‌ఏ కరుణాకర్‌రెడ్డి వైకాపా నాయకులు, కార్యకర్తలు గుమిగూడారు. దాంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి నదిఒడ్డున శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఎదురుగా 2016-17లో రివర్‌వ్యూ అనే రిసార్ట్ నిర్మాణం ప్రారంభించారు. దానిని 2019లో ప్రారంభించారు. అయితే ఇది నదీ పరివాహక ప్రాం తంలో ఉన్నట్లు ఆరోపణ. ఇక్కడ ఆనకట్ట ఆధునీకరణకు గతంలో ప్రభుత్వం తుడా నిధులు రూ.7.5 కోట్లు వెచ్చించి, కట్టను బాగు చేసారు. ఇది ఆక్రమణలని బఫర్ జోన్‌లో ఉన్నట్లు ఎంఎల్‌ఏ దృష్టికి తెచ్చారు. అయితే గత ప్రభుత్వ హాయాంలో జరిగిన ఆక్రమణలను, అన్యాక్రాంతాలను తొలగించాలని తెలుగుదేశం నాయకుడు నిర్ణయించుకున్నారు.

**శివమెత్తిన...మాజీ శాసనసభ్యుడు:**

రివర్‌వ్యూ అక్రమ ఆక్రమణ కట్టడమని అధికారులు తొలగింపుకు పూను కున్నారు. దాంతో అక్కడకు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి చేరుకున్నారు. పూనకం వచ్చినట్లు ఊగిపోయి, జెసిబి డ్రైవర్‌ను గదమా యిస్తూ, నా మీద నుంచి వాహనాన్ని నడిపించండి అంటూ. గోడ తొలగిస్తే ఆత్మాహుతి చేసుకుంటానని భీష్మించారు. దాంతో అధికారులు సందిగ్ధంలో పడ్డారు. ఆక్రమణలంటే నోటీసులు ఇచ్చారా? సర్వే జరిపారా అంటూ అధికారులను ప్రశ్నించారు.

**అధికారుల వివరణ:**

ఉదయం అధికారులు బాధితుల అభ్యర్థన మేరకు మూడు రోజులు సమయం ఇచ్చినట్లు సమాచారం. అయితే మధ్యాహ్నం నుంచి సీన్ మారింది.ఏం జరిగిందో ఏమో బహుశా కోర్టును ఆశ్రయిస్తారనుకున్నారో ఏమో కాని, మధ్యాహ్నం నుంచి మళ్ళీ జెసిబిలు ఏర్పాటు చేసుకొని కొంత భాగం తొలగించారు. ఈ సంఘటనకు సంబంధించి మున్సిపల్ టిపిఓ శారదను వివరణ కోరగా రివర్‌వ్యూ భవనం అంతా ఆక్రమణే అన్నారు. బఫర్‌జోన్‌లో ఉన్నట్లు తన వద్ద ఉన్న సమాచారం అన్నారు. ఇక్కడ 60 అడుగుల రోడ్డును మహాశివరాత్రికి ముందు ఏర్పాటు చేయటానికి ఆక్రమణలను తొలగించాలని నిర్ణయించినట్లు వివరించారు. దక్షిణం నుంచి ఉత్తరంగా ఆనకట్టకు పక్కన సర్వే ప్రకారం తొలగిస్తామన్నారు. ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐలు డి.గోపి, వెంకటేశ్వర్లు, తిమ్మయ్య, రవినాయక్ ఎస్‌ఐలు, సిబ్బంది మొహరించారు. ముందు జాగ్రత్తగా తిరుపతి నుంచి పోలీసులను రప్పించారు.

# మళ్ళీ హెల్మెట్ !

**-రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు అమలుకు సిద్ధం**



**ప్రభాతవార్త-తిరుపతి:**

ఇంటి నుండి రోడ్డుపైకి ద్విచక్రవాహనంపై రావాలంటే తప్పనిసరిగా తలకు హెల్మట్ ధరించడం విషయం మళ్ళీ తెరపైకి వచ్చింది. ఇటీవల రాష్ట్ర హైకోర్టు హెల్మట్ అంశంపై అసహనం వ్యక్తం చేయడం, పోలీసులు విధిగా అమలు చేయలేకపోయారని ఒకింత ఆగ్రహం తెలిపిన విషయం విదితమే.ఈ నేపథ్యంలో పుణ్యక్షేత్రం ,యాత్రాస్థలం తిరుపతి నగరంలో ద్విచక్ర వాహనదారుడు సురక్షితంగా వాహనాలు నడిపి, ప్రాణాలను కాపాడుకోవడంలో శిరస్త్రాణం (హెల్మెట్) ధరించడం తప్పనిసరి చేసేందుకు పోలీసు అధికారులు చర్చిస్తున్నారు. అయితే హెల్మెట్ ధారణ కొన్ని ఇబ్బందులు, కొన్ని సాంకేతిక కారణాలు,పట్టణ, నగర పరిధిలో ఆరేడు కిలోమీటర్ల లోపు హెల్మెట్ ధరించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో పోలీసు అధికారులు కూడా కొంత వెనుకంజవేశారు. అసలు హెల్మెట్ ధరించడమనేది గతంలోనే అరకొరగా మారింది. నగరంలో నాలుగులక్షల పైవరకు ద్విచక్రవాహనాలు ఉన్నట్లు సమాచారం. వీరిలో కనీసం సగంశాతంమందికి కూడా హెల్మెట్లు లేవంటే ఆశ్చర్యపోవలసిన విషయం లేదు. పైగా ఇప్పటివరకు పలు దఫాలుగా ఆరేడుసంవత్సరాల క్రిందట హెల్మెట్ ధారణ తప్పని సరిచేసినా చివరకు ఆచరణలో కొంత విఫలమైన పోలీసుశాఖ ఇప్పుడు మళ్ళీ రాష్ట్ర ఉన్నతన్యాయస్థానం ఉత్తర్వులతో అమలుచేయక తప్పడంలేదు. ఇప్పుడు మార్కెట్లో హెల్మెట్ ధర కూడా అమాంతంగా 1,500 రూపాయల నుండి 2,500 రూపాయల వరకు ఉందని అంటున్నారు. అయితే సాధారణ,మధ్య తరగతి వర్గాల వారికి హెల్మెట్‌లు ఇప్పటికీ అందుబాటులో లేదు. తిరుపతిలో ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధారణ విషయం తెరపైకి రావడంతో ఎప్పటి నుండి అమలుచేయనున్నారనేది తెలియాల్సి ఉంది. ద్విచక్రవాహనం నడిపే ప్రతి వ్యక్తి తలకు సురక్షితంగా హెల్మెట్ ధరించడమనేది బాధ్యత. ఇప్పటికే తిరుపతిలో హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న వారిని వ్రేళ్లపై లెక్కించవచ్చునేది పోలీసువర్గాల సమాచారం.

**-హెల్మెట్ ధరించండి: ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణమాచారి**

తిరుపతిలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నగరంలో హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణమాచారి తెలిపారు. హైకోర్టు ఆదేశాలను అందరూ పాటించాలి.ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలి.

# భక్తులతో కిటకిటలాడిన కాణిపాకం ఆలయం

**-సర్వదర్శనానికి నాలుగు గంటల సమయం**



కాణిపాకం,డిసెంబర్ 14 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయం శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రంల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు కార్తీకమాసం సందర్భంగా అయ్యప్పభక్తులు, తిరుమల వెళ్ళే తీర్థజనం కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం పెద్దఎత్తున తరలి రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు కూడా క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు మూడు

# చిట్టమూరు మండలంలో సాగునీటి సంఘాలు ఏకగ్రీవం



చిట్టమూరు, డిసెంబర్ 14 ప్రభాతవార్త : చిట్టమూరు మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలన్నీ ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 30 సాగునీటి సంఘాలకు గాను 28 చోట్ల టిడిపి, ఒకచోట బిజెపి, మరొకచోట జనసేన పాగా వేశాయి. నియోజకవర్గ పెద్దలు, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజీ, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సూచనల మేరకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి సాగునీటి సంఘాలను కైవసం చేసుకున్నట్లు మండల టిడిపి కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు వారు అభినందనలు తెలియజేశారు. అయితే జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలకు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో చిట్టమూరు మండల వైసీపీ నాయకులు దూరంగా ఉన్నారు. మల్లాం చెరువుకు కన్వీనర్‌గా దువ్వూరు మస్తాన్‌రెడ్డి, ఎల్లూరుకు దువ్వూరు సుధాకర్‌రెడ్డి, బిజికెపాలెం ఈశ్వరవాక రామకోటేశ్వరరెడ్డి, పాడేరు చెరువుకు ఎర్రబోతు నాగయ్య, కోగిలికి షేక్ ముజీమీర్, సోమసముద్రానికి గణపర్తి వెంకట సుబ్రహ్మణ్యంనాయుడు, వేము గుంటపాలెంకు ఎస్‌కె రషీద్, చిల్లమూరుకు అరిగెల ఓమనరావు, రామాపురానికి గుండుబోయిన శ్రీనివాసులు, జానాగుంట చెరువుకు వసంతమ్మ, కలగుర్తి పాడుకు నూతలపాటి అనూష, మొలకలపూడికి వెదనపర్తి రాజగోపాల్‌రెడ్డి, యాకసిరి ఎర్రచెరువుకు బసివిరెడ్డి హరిబాబు, యాకసిరి పెద్ద చెరువుకు వేమసాని శ్రీనివాసులునాయుడు, ఉప్పలమర్తికి గోవర్దన్, అద్దిపూడికి చిగురువాడ మురళీధర్, జంగాలపల్లికి బత్తల ప్రభావతి, మెట్టుకు పుచ్చలపల్లి భాస్కర్‌రెడ్డి, ఈశ్వరవాకకు గుండుబోయిన వెంకట సుబ్బయ్య, యల్లసిరికి నల్లారెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆలేటిపాడుకు పెళ్లూరు సుధాకర్‌రెడ్డి, చిట్టమూరుకు గణపర్తి ప్రభాకర్‌నాయుడు, దరకాస్తు చిన్న చెరువుకు మల్లి ముత్యా లయ్య, పెద్దచెరువు ఈశ్వరవాక పరంధామరెడ్డి, మన్నెమాలకు మారంరెడ్డి జనార్ధన్ రెడ్డి, తాడిమేడుకు పల్లం వెంకట రమణయ్య, ఆరూరు పెద్దచెరువుకు ఉక్కు నారాయణ, రెట్టగుంట చెరువుకు దందూరు వెంకటే శ్వర్లు, నార్త్‌వరత్తూరుకు పసుపులేటి మీనా, గునపాడుకు కేతిరెడ్డి మోహన్ రెడ్డిలు సాగునీటి సంఘాల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆరూరు సాగునీటి సంఘాన్ని పంచాయతీలో పత్తాలేని జనసేన పార్టీకి కేటాయించడంపై పలు విమర్శలు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆరూరు సెగ్మెంట్‌లో టిడిపికి తిరుగులేని నిరూపించడంలో ఎంపిటిసి, సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకున్నప్పటికీ ఆరూరు సాగునీటి సంఘాన్ని జనసేన పార్టీకి కేటాయించడంతో శనివారం కనీసం టిసి మెంబర్లను కూడా ఏర్పాటు చేసుకో లేని దిక్కులేని పరిస్థితి జనసేన పార్టీకి ఉంది. ఇలాంటి పరిణామాల్లో తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న ఆరూరులో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి జ్వాలలు రగులుకోవడంతో పాటు అధిష్టానం తీసుకున్న ఈ నిర్ణయాన్ని మండల పార్టీ నాయకులు సైతం తీవ్రంగా తప్పుబడుతున్నారు.

# గూడూరు డివిజన్

## ఎన్‌బికెఆర్ అధ్యాపకురాలికి డాక్టరేట్



కోట, డిసెంబర్ 14 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మునగల హరితకు యోగి వేమన విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ చింతా రవీంద్రారెడ్డి తదితరులు హరితను అభినందించారు. ఆమె యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఫైనాన్షియల్ ఇంక్లూషన్ అండ్ ఉమన్ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై పరిశోధన చేశారు. అందుకుగాను ఆమెకు యోగివేమన విశ్వవిద్యా లయం వారు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు.

## 16,17 తేదీల్లో ఎల్‌ఎస్‌డి జివై శిక్షణ

బాలాయపల్లి, డిసెంబర్ 14 ప్రభాతవార్త : ఈ నెల 16,17న స్త్రీ శక్తీ కార్యాలయంలో ఎల్.ఎస్.డి.జి.పై శిక్షణ తరగతులు ఎంపీడీవో వినీల్ కుమార్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు. సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

## ఎన్‌బికెఆర్‌లో ఘనంగా జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం



కోట, డిసెంబర్ 14 ప్రభాతవార్త: కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో శనివారం జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం 1991లో ప్రారంభించారని చెప్పారు. శక్తి వృధాను తగ్గించడం, వనరులను కాపాడుకోవడంలో ప్రజలు, విద్యార్థులు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. ఇందులో భాగంగా కళాశాల పైకప్పున 320 కెడబ్ల్యుహెచ్ సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు సప్లై చేయడం జరుగుతుందన్నారు. ఈ విధంగా చేయడం వలన ఎలక్ట్రికల్ పవర్‌ను ఆదా చేయవచ్చుని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంధన కొరత ఏర్పడితే ఎలా అధిగమించాలనే అంశంపై వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు.

## సరస్వతి శిశు మందిర్‌కు రూ.లక్ష ఆర్థిక సహాయం



గూడూరు, డిసెంబర్ 14 ప్రభాతవార్త : పాతపాటి సుబ్రహ్మణ్యం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని సరస్వతీ శిశు మందిరంలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ ప్రొజెక్టర్‌ను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. పాఠశాలకు ఎమ్మెల్యే లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. గూడూరు పట్టణంలోని సరస్వతీ శిశు మందిరంలో పాతపాటి సుబ్రహ్మణ్యం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వారి కుటుంబ సభ్యులు దాతృత్వంతో ఏర్పాటు చేసిన డిజిటల్ ప్రొ జెక్టర్‌ను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. అదేవిధంగా గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ నందున్న పేదలకు అన్నదానం మరియు దుప్పట్లు అందించి, ట్రస్ట్ మరమ్మతుల కొరకు తన నెల జీతం నుండి డెబై వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్ రెడ్డి, డాక్టర్ జనార్దన్ రెడ్డి, పురుషోత్తం, బిల్లు చెంచు రామయ్య, సనత్ కుమార్ రెడ్డి, ఎస్‌ఎల్‌ఎన్ బాబు, పాదర్తి ప్రసాప్రసాద్ తదితరులు పా ల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు రైలు కింద పడి మహిళ మృతి!

గూడూరు, డిసెంబర్ 14 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో హౌరా నుండి బెంగళూరు వెళ్తున్న క్రమంలో ప్రయాణిస్తున్న మహిళ త్రాగు నీటి కొరకు స్టేషన్లో దిగి తిరిగి రైలు ఎక్కుతుండగా ప్ర మాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందిన మహిళ ఒడిస్సా రాష్ట్రం సబిత ఆచార్య (52) మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలిం చారు. మృతి చెందిన మహిళ పసుపు చీర ఎర్ర జాకెట్ ధరించి ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## రైతులను విస్మరించిన వైసిపి ప్రభుత్వం



బాలాయపల్లి, డిసెంబర్ 14 ప్రభాతవార్త : గత వైసిపి ప్రభుత్వం రైతుల ను పట్టించుకోలేదని నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి తాళ్ల వెంకటేష్ గౌడ్ విమర్శించారు. ఆయన విలేకరుల సమీవేశంలో మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలు దోచుకోవడం, దోచుకు న్నది పంచుకోవడం, పంచుకున్నది దాచుకోవడం అనే అజెండాతో వ్యవహరించి, అసలు రాష్ట్రంలో రైతులు,వాళ్ళ సమస్యలు అనే అంశాన్ని పూర్తిగా స్మరిచ్చిందని తెలిపారు.

## ఏకగ్రీవంగా సాగునీటి సంఘ ఎన్నికలు

### - ఛైర్మన్లుగా ఎన్నికైన వారిని సన్మానించిన టిడిపి నాయకులు



శ్రీరంగరాజపురం, డిసెంబర్ 14 ప్రభాతవార్త: శ్రీరంగరాజపురం మండలంలో శనివారం నిర్వహి ంచిన సాగునీటి సంఘ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యా యి. సాగునీటి సంఘ అధ్యక్ష ఎన్నికలో కొంత ఉత్కంఠత నెలకొన్నప్పటికీ ఆపై ఏకగ్రీవం అయ్యా యి. తహసీల్దారు లోకనాధపిళ్ళై, ఎస్ఐ సుమన్, ఇరిగేషన్ ఎఇ రవినాయక్‌ల ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మూలూరు చెరువు నీటి సంఘ అధ్యక్షులుగా ఉమాపది, రాజ పెరుమాళక్క నీటి సంఘ అధ్యక్షులుగా మునెమ్మ, ఎస్ఆర్‌పురం నీటి సంఘ అధ్యక్షులుగా రవి, పుల్లూరు నీటి సంఘ అధ్యక్షులుగా రమేష్, ఆరిమాకులపల్లి కోనచెరువు నీటి సంఘ అధ్యక్షులుగా బుల్లెట్‌బాబు, దేవళం చెరువు నీటిసంఘ అధ్యక్షులుగా రామిరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష, ఉపాధ్య క్షులుగా ఎన్నికైన వారికి ఎలక్షన్ అధికారులు డిక్లరేషన్ ఫారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మురళీమోహన్, ఎఓ నర్మదా, ఎన్నికల సిబ్బంది, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

**సాగునీటి సంఘాల అధ్యక్షులకు సన్మానం:**

మండల పరిధిలో సాగునీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికైన వారిని శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్‌నాయుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు గంధమనేని రాజశేఖర్‌నాయుడులు ఘనంగా సన్మానించారు. పుల్లూరు క్రాస్ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం నాయకులు కొత్తగా ఎన్నికైన వారిని పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్‌కు కొత్తగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం



పుత్తూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త : పుత్తూరు మండలంలో శనివారం జరిగిన ఏడు చెరువుల ఆయకట్టు సాగు నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమ య్యాయి. గూలూరు చెరువు ఆయకట్టు సంఘం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌గా ఎస్.వెంకట్రా యలు, కె.కృష్ణయ్య ఎన్నికయ్యారు. నేసనూరు చెరువు ఆయకట్టు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లుగా వి.శ్యామల, కె.మణి, కెబిఆర్ పురం ఆయకట్టు సంఘం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌గా పి.శివయ్య, సి.సుబ్రమణ్యంరాజు, పుత్తూరు చెరువు సాగు నీటి సంఘం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌గా బి.సి.శ్రీనివాసులు, ఎన్.వినోద్‌శంకర్, నందిమంగళం చెరువు సంఘం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌గా దేగల కుశలకుమార్, మునిరత్నంనాయుడు, వీరప్పరెడ్డిపాలెం చెరువు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌గా సి.పరశురామ నాయుడు, అన్బళగన్, చినరాజుకుప్పం సాగునీటి సంఘం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌గా బి.కోటేశ్వరరావు, హరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ గంజి మాధవయ్య, పట్టణ టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నం నాయుడు, ఎన్.ఎన్.ధనపాల్ అభినందించారు.

## 22చెరువుల సాగునీటి సంఘాలు ఏకగ్రీవం



బాలాయపల్లి, డిసెంబర్ 14 ప్రభాతవార్త : మండలంలోని 22 సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గూడూరు డివిజన్‌లోని అతి పెద్ద చెరువు అయినా కయ్యూరు చెరువు అధ్యక్షునిగా రాయి మస్తాన్ నాయుడు, ఉపాధ్యక్షులుగా దామ సత్యం నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మల్లెమాల చెరువు అధ్యక్ష నిగా సాగి నరసింహులు నాయుడు, ఉపాధ్యక్షులుగా జి బాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గాజులపల్లి చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా దాసరి కోటేశ్వరరావు ఉపాధ్యక్షులుగా సర్వేపల్లి కుమారస్వామి నిడిగల్లు చెరువుకు ఆది రామచంద్రారెడ్డి ఉపాధ్యక్షుడిగా మారెళ్ళ వెంకటసుబ్బారెడ్డి, సిద్ధగుంట చెరువుకు పెట్లూరు జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడుగా పోలిరెడ్డి, ఊట్లపల్లి చెరువు మధు బాబు, ఉపాధ్యక్షుడు కే.నాగరాజురెడ్డి, కామకూరు చెరువుకు బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడిగా సర్వేపల్లి మురళి, బైరవ చెరువుకు దాసరి కృష్ణమ నాయుడు, ఉపాధ్యక్షుడిగా బాబయ్య, సంగవరం జి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గంగయ్య, కాటంరాయుడు చెరువుకు డి.పురుషోత్తం ఉపాధ్యక్షుడుగా, శ్రీనివాసులు ఎన్నికయ్యారు. కయ్యూరు చెరువు అధ్యక్షుడు మస్తాన్ నాయుడు మాట్లాడుతూ చెరువు అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఎన్నికల అధికారులుగా జావేద్దు, ఆర్ముగం, పి శిరీష, శివప్రసాద్, వ్యవహరించారు.

## ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు



వెంకటగిరి, డిసెంబర్ 14 ప్రభాతవార్త : మండలంలోని 30 చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగా యి. మండలంలోని వెంకటగిరి చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా గిరిబాబు, అక్కమాంబ చెరువు స్వామి నేటి సంఘం అధ్యక్షులుగా చంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెంకటగిరి చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా గిరిబాబు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నాగార్జునసాగర్ ప్రకటించారు. మండలంలోని అన్ని చెరువుల సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సాగునీటి సంఘాలు ఎన్నికలు జరిగే పాఠశాలల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## 30 సాగునీటి సంఘాల్లో టిడిపి మద్దతుదారులే



వెంకటగిరి, డిసెంబర్ 14 ప్రభాతవార్త : మండలంలోని 30 సాగునీటి సంఘాలకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికైన ఆ పార్టీ మండల అధ్యక్షులు పప్పు చంద్ర మోళిరెడ్డి తెలిపారు. ఎన్నికల్లో ఎన్నికైన వారందరికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అభినందనలు తెలిపారు. మండల పరిధిలో మేజర్ ఆయకట్టు చెరువు అయిన కలవలపూడి సాగునీటి సంఘం అధ్యక్షులుగా పప్పు క్రిష్ణారెడ్డి ఎకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన సాగునీటి సంఘ అధ్యక్షులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## 18 సాగునీటి సంఘాల ఛైర్మన్ ఏకగ్రీవం



వాకాడు, డిసెంబర్ 14 ప్రభాతవార్త : వాకాడు మండలంలోని శనివారం 18 సాగునీటి సంఘాల ఛైర్మన్‌లు టిడిపి మద్దతు దారులకే ఏకగ్రీవం అయ్యా యి. మండలంలోని ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో 19 చెరువు సంఘాల ఛైర్మన్లు ఉండగా, కొండాపురం గ్రామంలో అన్న ట్యాంక్ ఛైర్మన్ పదవి కోసం టిడిపి వర్గంలోనే సీనియర్ పార్టీనాయకుడు నాకు కావాలని, అదే పార్టీలో కొనసాగుతున్న మరో టిడిపి నాయకుడు కావాలని ఇరువురు నాయకుల మధ్య నువ్వు నేనా అన్నట్టుగా ఉండడంతో టిడిపి పార్టీ సీనియర్ నాయకులు, సర్దుబాటు చేసిన ఆ ఇరువురు నాయకులు సర్దుబాటు కాకపోవడంతో అన్నా ట్యాంక్ ఛైర్మన్ పదవి వాయిదా పడింది. సాగునీటి సంఘాల ఛైర్మన్లు టిడిపి మద్దతుదారులకే ఏకగ్రీవం అయింది.

## సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల హవా

కోట, డిసెంబర్ 14 ప్రభాతవార్త : కోట మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొక్కుపాడులో యరటపల్లి శ్యాంసుందర్‌రెడ్డి, నెల్లూరుపల్లి కొత్తపాలెంలో నెల్లూరు మోహన్‌రెడ్డి, అల్లంపాడులో రాజారెడ్డి, కర్లపూడిలో పేర్నాటి ఆనందరెడ్డి, ఊనుగుంటపాలెంలో రఘురామిరెడ్డి, కొత్తపట్నంలో శివకుమార్, ఉత్తమనెల్లూరులో జంగిట కృష్ణయ్యలను ఎన్నుకున్నారు. మండలంలో 20 సాగునీటి సంఘాలకు గాను దాదాపు ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, జలీల్ అహ్మద్, మధుసూదన్ యాదవ్, సీనియర్ నాయకులు వ్యూహాత్మకంగా ఈ ఎన్నికల్లో అభ్యర్థులను ఏకగ్రీవం చేసుకోవడంలో పైచేయి సాధించారు. అయితే సాగునీటి సంఘాల ఎన్నికలకు వైసీపీ నాయకులు పాల్గొనకుండా దూరంగా ఉండిపోయారు.

## ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

సూళ్లూరుపేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలంలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిధిలోని 20 చెరువులకు ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అక్కడక్కడా కొద్దిపాటి ప్రతిష్టంభన ఏర్పడినప్పటికీ చివరికి అన్ని సాగునీటి సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. అధికార పార్టీకి చెందిన వారే సాగునీటి సంఘాలకు అధ్యక్షులుగా ఎంపికయ్యారు. మొత్తం 20 చెరువులకు సంబంధించి 20 మంది అధ్యక్షులు, 120 మంది సభ్యులుగా ఎన్నికల ప్రక్రియ ముగిసింది. అధికార యంత్రాంగం ఈ ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో సఫలీకృతులయ్యారు.

## వరద బాధితులకు ఆహారం పంపిణీ

సూళ్లూరుపేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని వట్రపాలెం వరద బాధితులకు ప్రముఖ పారిశ్రామికవేత్త, జివిఆర్ సంస్థల అధినేత కొండేపాటి గంగాప్రసాద్ ఆర్థిక సహాయంతో ఆహార పొట్లాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ మాట్లాడుతూ వరద బాధితులైన వట్రపాలెం వాసులను కొంత మేరకు సాయం అందించేందుకు కొండేపాటి గంగాప్రసాద్ స్పందించి ఆహారం సరఫరా చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పార్థసారధి, మేడా సాయినారాయణ, కె.శ్రీధర్, వెంకటేష్ యాదవ్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సూళ్లూరుపేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.అనిల్ కుమార్ అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో నిర్వహిం చిన లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా రాజీలు కుదుర్చుకొని కోర్టు చుట్టూ తిరగకుండా, వ్యయ ప్రయాసలకు లోనుకాకుండా కేసులు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సుబ్బారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రకృతికుమార్, సూళ్లూరుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీరాములు యాదవ్, లోక్ అదాలత్ సభ్యులు కె.ధర్మాప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ముగిసిన కార్తీక దీప ఉత్సవాలు



తడ, డిసెంబర్ 14 ప్రభాతవార్త : ఈ ఏడాది కార్తీక మాసం మొత్తం శివాలయాలలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దీపోత్సవాలతో ముగిశాయి. తడ మండలంలోని పలు శివాలయాల్లో నెలరోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. పులికాట్ సరస్సు తీరంలో ఉన్న వాటంబేడులోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. కార్తీకమాసం చివరిరోజు దీపోత్సవంలో వాటంబేడుతో పాటు సమీప గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## వర్షం లేదు.. వరద ఉంది

తడ, డిసెంబర్ 14 ప్రభాతవార్త : వర్షం తగ్గినప్పటికీ వరద మాత్రం తగ్గలేదు. తడ మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికీ పంట పొలాలు జలమయమై ఉన్నాయి. ఇక్కడ కురిసిన వర్షం కన్నా కాళంగి నది గేట్లు ఎత్తివేయడం వలన వచ్చిన వరద తీవ్రమయింది. పల్లపు ప్రాంతాలు దిగువన ఉన్న కారణంగా కాళంగి గేట్లను ఎత్తివేసినప్పుడు అవి నేరుగా కాలువలు, పొలాలపైకి మళ్లుతున్నాయి. ప్రతి వానాకాలంలోను ఇదే పరిస్థితి ఎదురవుతోంది. వర్షాన్ని మించి వరద చుట్టుముడుతోందని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం వంటి తీరప్రాంత గ్రామాలు అధికంగా ఉన్న మండలాల ప్రజలు గోడుమంటున్నారు. కనీసం ఎగువన కెవిబిపురం మండలంలో కాళంగి ఆనకట్ట నుంచి గేట్లు ఎత్తివేసే సమయాన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించడం లేదని ప్రత్యేకించి రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఈ మూడు మండలాల్లో 8వేల ఎకరాలకు పైగా వరిపంట మునిగినట్లు అధికార యంత్రాంగం ప్రాథమిక అంచనాల ద్వారా తెలుస్తోంది.

## కన్నుల పండువగా శ్రీదత్తాత్రేయునికి పాలాభిషేకం



సూళ్లూరుపేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీసాయి సత్సంగ మందిరంలో దత్త జయంతిని పురస్కరించుకొని స్వామివారికి 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకాన్ని కన్నులపండువగా శనివారం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, 108 స్వర్ణ కమలాలతో అష్టోత్తర శతనామ పూజ, స్వర్ణమకతోరణం, స్వర్ణ కిరీటం అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయినగర్‌లోని శ్రీసాయి మందిరంలో షిరిడీ నాథునికి ప్రత్యేక అలంకారంతో పాటు దత్తాత్రేయ స్వామికి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కస్వారెడ్డిపాలెం షిరిడీ సాయినాథుని ఆలయంలో జరిగిన కార్యక్రమా నికి పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కవిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరిం చారు. సాయినగర్‌లోని కార్యక్రమాలకు ఆరూరు చంద్రశేఖర్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసన




పుత్తూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త : బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న మారణకాండను నిరసిస్తూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)ఆధ్వర్యంలో శనివారం పుత్తూరు పట్టణంలో ర్యాలీ జరిగింది. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, భారతీయ జనతా పార్టీ నాయకులు వందలాది మంది ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని శివాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కాపు వీధి, బజారు వీధిల మీదుగా ద్రౌపది దేవి గుడి వరకూ కొనసాగింది. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో కొంత సేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భ ంగా బిజెపి మహిళా మోర్చా నాయకురాలు ఎం.నిషిధ రాజు మాట్లాడుతూ హిందువులంతా సంఘటితమై బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు కారణమైన వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు గోవిందరాజులు, బిజెపి నాయకులు శ్రీధర్, కోటకొండ బాబు, యువరాజ్, నారాయణస్వామి, మధు, హరి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ రక్షక్ సిబ్బందిచే విద్యార్థులకు అవగాహన



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 14 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు వెస్ట్ మహిళ రక్షక్ సిబ్బంది తిరుపతి సబ్ డివిజన్ పరిధిలోని రిక్షా కాలనీలో మహిళలు, పిల్లలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం సమాజంలో ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి, వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, అలాగే సామాజిక మాధ్యమాల వలన అనర్థాలు, వ్యక్తిగత ఫోటోలు వీడియోలు పెట్టడం వలన కలిగే నష్టం గురించి అవగాహన కల్పించారు. ప్రస్తుతం అత్యాధునిక పరిజ్ఞానంతో చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వీడియో కాల్స్ సమాధానం ఇవ్వకూడదని చెప్పి అటువంటి కాల్స్ ఏమైనా వస్తే వెంటనే ఆ ఫోన్ నెంబర్ బ్లాక్ చేసి, విషయాన్ని దగ్గర్లోని పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ విభాగాలను సంప్రదించాలని తెలిపారు. అదే విధంగా బ్యాంకు వారు ఎప్పుడు కానీ కస్టమర్స్ యొక్క ఆధార్ కార్డు, ఓటిపి నెంబర్‌ను ఎప్పుడు అడగరని, అలాంటి కాల్ ఏమైనా వచ్చినప్పుడు కూడా మోసపూరిత ఫోన్ కాల్‌గా గుర్తించాలని అలాగే ఎవరైనా చిన్న పిల్లల అశ్లీల వీడియోలు, చూడటం, ఇతరులకు పంపడం కూడా శిక్షార్హులని తెలిపారు. మహిళలకు ఎటువంటి సమస్యలు వచ్చిన డయల్ 112 లేదా వాట్సాప్ 8099999977 నంబర్లకు సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మహిళా రక్షక్ పోలీసులు తెలిపారు.

## సత్రవాడ కుటుంబాన్ని గుర్తించండి... సిఎం చంద్రబాబుకి, మంత్రికి లోకేష్‌కు వినతి



శ్రీకాళహస్తి,డిసెంబర్ 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి రాజకీయ చరిత్రలో సత్రవాడ మునిరామయ్యకు మంచి పేరు ఉందని పార్టీ వ్యవస్థాపకులు ఎన్టి రామారావు ఆయన సేవలు, గుర్తించి ఆయన్ను ఒకసారి ఎంఎల్ఏగా అవకాశం కల్పించారని మరో సారి తుడా ఛైర్మెన్‌గా అవకాశం కల్పించారని వివరిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,సాంకేతిక,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు వివరించారు. శనివారం ఆయన ఇద్దరిని కలసి శ్రీకాళహస్తి రాజకీయం గురించి ఇక్కడ ప్రధాన నాయకుల గురించి వివరించినట్లు తెలిసింది.శ్రీకాళహస్తి పరిపాలన అంతా శ్రీకాళహస్తీశ్వరుని ఆలయం చుట్టూ తిరుగుతుంటుందన్నారు. నేడు ప్రభుత్వం యువతకు ప్రాధాన్యత ఇస్తున్నారని కాబట్టి సత్రవాడ మునిరామయ్య కుమారుడు సత్రవాడ ప్రవీణ్‌కు రాజకీయంగా చేయూత ఇవ్వాలని కోరారు. వారు బిసిలు కాబట్టి శ్రీకాళహస్తీశ్వరాలయంలో అవకాశం కల్పించాలని కోరినట్లు వివరించారు. కాక అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను ఇద్దరికి వివరించారు. శ్రీకాళహస్తికి ప్రత్యేక నిధులు కేటాయించాల్సి ఉందని వివరించారు. శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తు న్నాయని పట్టణానికి ప్రత్యేక నిధులు కేటాయిం చాలని కోరారు. రాజీవ్‌నగర్‌లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వ హాయంలో భారీ ఎత్తున కుంభకోణాలు జరిగాయని దీనిపై ఎందుకో సుమారు 15సంవత్సరాలుగా అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారని ఇద్దరి దృష్టికి తెచ్చినట్లు సమాచారం

## భక్తులకు ధనుర్మాస ప్రత్యేక బస్సులు




తిరుపతి(రవాణ),డిసెంబర్ 14ప్రభాతవార్త: పవిత్రమైన ధనుర్మాసంలో స్థానిక ఆలయాలు సందర్శనకు భక్తులకు ఆర్టీసి ధనుర్మాస ప్రత్యేక బస్సులు నడుపు దుతున్నారు. డిసెంబర్ 16వతేదీ నుండి జనవరి 15వరకు ప్రతి వైష్ణవాల యాలను దర్శించి పూజలు చేసే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసి ముఖ్య ఆలయాలు అత్తిరాల, నందలూరు, ఒంటిమిట్ట, దేవునికడప, పుష్పగిరి, పెంచలకోన, రంగనాధగుడి, నరసింహ కొండ, వేణు గోపాలస్వామి ఆలయం (కార్వేటినగరం), నారాయ ణవనం, నాగలాపురం, సురుటుపల్లి, గోల్డెన్‌టెంపుల్, కాంచీ పురం, శ్రీనివాసమంగాపురం, వాల్మీకిపురం,కదిరి ప్రాంతాలకు ఇతర ఆలయాలకు బస్సులు ఇవ్వబడు తుందని ఆర్ఎం జగదీశ్ తెలిపారు. మరిన్ని వివరాలకు తిరుపతి- 9959225670, అలిపిరి-9959225671, మంగళం- 7893723453, శ్రీకాళహస్తి- 9959225673, పుత్తూరు- 9959225680, సత్యవేడు-9959225682, గూడూరు- 9959225644, సూళ్ళూరుపేట- 9959225646, వేంకటగిరి-9959225647, వాకాడు-9959225644 నంబర్లకు సంప్రదించాలి.